

శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో చక్రస్నానం

## ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

### భక్తిశ్రద్ధలతో చక్రస్నానం

బంజారాహిల్స్, అక్టోబర్ 25: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో పదిరోజుల పాటు సాగిన నవాహ్నిక బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిసాయి. చివరిరోజున మహా పూర్ణాహుతి, పంచ వింశతి కలశ స్నపనం, చక్రస్నానం, కుంభప్రోక్షణ, బలిహరణ, నివేదన, తీర్థ ప్రసాద గోష్ఠి తదితర పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం శ్రీ పుష్పయాగం, ద్వాదశారాధనలు, ధ్వజ అవరోహనం, అశ్వవాహన సేవ, సప్తావరణ ప్రదక్షిణలు తదితర కార్యక్రమాలతో ఉత్సవాలు ముగిసాయి. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సీహెచ్ రామయ్య, ఈవో లావణ్య, పాలక మండలి సభ్యులు, ఆలయ అర్చకులు, వేద పండితులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

## ఈజిప్ట్ అవిర్భావం ఆవిష్కరణ

రవీంద్రభారతి, అక్టోబర్ 25: ప్రముఖ రచయిత, సీనియర్ పాత్రికేయుడు డాక్టర్ ఎస్.వేణుగోపాల్ రచించిన 'ఈజిప్ట్ అవిర్భావం, 4,500 సంవత్సరాల తెలుగు జాతి వైభవం' పుస్తకావిష్కరణ సభ బుధవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో కనుల పండువగా జరిగింది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సుధా ప్రచురణాలయం, కళ పత్రిక సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగింది. ఇందుకు ముఖ్య అతిథిగా డాక్టర్ వీడీ రాజగోపాల్ విచ్చేసి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి, రచయిత వేణుగోపాల్‌ను ఘనంగా సత్కరించారు. వేల ఏళ్ళ ఘన చరిత్ర ఈజిప్ట్‌కు ఉందని, అక్కడ మన తెలుగు రాష్ట్రాల మూలాలు కూడా ఉన్నాయని తన పరిశోధనలో రచయిత వేణుగోపాల్ కనుగొని పుస్తక రూపంలో తీసుకురావడం నిజంగా ఆసక్తిదాయకమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కళ పత్రిక సంపాదకుడు డాక్టర్ మహ్మద్ రఫీ, డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, మెట్రో టీవీ చీఫ్ ఎడిటర్ కొండవీటి జయప్రసాద్, గుదిబండ వెంకట్‌రెడ్డి, కవయిత్రి చేబ్రోలు శశిబాల, అటవీ శాఖ అధికారి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



బతుకమ్మ సంచికను విడుదల చేస్తున్న కెనడాలో తెలంగాణ సమాజం

## కెనడాలో ఘనంగా బతుకమ్మ సంబురాలు

తెకెనడాలో ఘనంగా బతుకమ్మ సంబురాలు..లుగు ప్రజలు ఏ దేశంలో ఉన్నా మన సంస్కృతిని, సంప్రదాయాలను మరవడం లేదు. కెనడాలోని అనాఫిలిస్ హాల్‌మిస్సి సాగాలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించినట్లు అక్కడి ప్రతినిధులు 'నమస్తే'కు తెలిపారు. తెలంగాణ ప్రాంత వాసులు 3500 మంది మహిళలు బతుకమ్మ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శిల్పి చందా, శ్రీదేవి, కల్లేపల్లి, సమతా కాకర్ల, వైదేహి భగత్, అన్నపూర్ణ జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా 95 బతుకమ్మలను పేర్చారు. కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్ మన్నెం మాట్లాడుతూ తెలుగు ప్రజలు కెనడాలో భక్తి శ్రద్ధలతో బతుకమ్మ సంబురాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ సంచికను విడుదల చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మనోజ్ రెడ్డి, నేరుళ్లపల్లి శంతన్, సంయుక్త కార్యదర్శి రాజేశ్,ప్రతినిధులు ప్రవల్లిక, మ్యాకల వేణుగోపాల్, రాహుల్, నాగేశ్వర్ రావు, ప్రవీణ్ కుమార్, శంకర్ భరద్వాజ, నవీన్, మాధురి చాతరాజు, దేవేందర్‌రెడ్డి, కోటేశ్వర్ రావు, ప్రకాష్, తిరునగరి శ్రీనివాస్, విజయ కుమార్ పాల్గొన్నారు.

- రామంతాపూర్, అక్టోబర్ 25



## జై మాతా..

నవరాత్రులు నగరవాసుల పూజలందుకున్న దుర్గామాత భక్తుల భారీ ఊరేగింపులు, జయ ధ్వానాల నడుమ నగర వాసుల సేవలందుకుంటూ బుధవారం హుస్సేన్‌సాగరంలో గంగమ్మ సన్నిధి చేరుకుంది. భక్తుల సేవకు తరించి తుదకు సెలవంటూ గంగమ్మలో ఐక్యమయ్యింది.



హుస్సేన్ సాగర్ పరిసరాల్లో అమ్మవారికి తుది హారతి ఇస్తున్న భక్త జనం



గంగమ్మ సన్నిధికి చేరుకున్న దుర్గమ్మ

## అలయ్ బలయ్

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు విచ్చేసిన రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీని వాస్ యాదవ్, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను ఆలింగనం చేసుకొని దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను మరింత పెంపొందించేలా ఈ వేడుకలను చేపట్టడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయతో పాటు కాంగ్రెస్, బీజేపీలకు చెందిన ప్రముఖులు, నాయకులు, పలు సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

- సుల్తాన్ బజార్, అక్టోబర్ 25



అలయ్ బలయ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, చిత్రంలో విజయలక్ష్మి



తెలంగాణ సంప్రదాయ వేడుకైన బతుకమ్మలతో హర్యానా గవర్నర్ దత్తాత్రేయ, కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి, దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి, తదితరులు

## ఆకట్టుకున్న భరత నాట్య ప్రదర్శనలు

మాదాపూర్ శిల్పారామంలో కొనసాగుతున్న ఆల్ ఇండియా శారీ మేళా, బతుకమ్మ ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఇందులో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనల్లో నారాయణి నాట్యాలయ గురువు సంతోష్ కుమార్ తమంగ్ శిష్య బృందం భరతనాట్య రీతులతో అలరించారు.

- కొండాపూర్, అక్టోబర్ 25;

నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు



## ఉష్ణోగ్రతలు.. స్వల్పంగా తగ్గుముఖం

సిటీబ్యూరో, అక్టోబర్ 25(నమస్తే తెలంగాణ): ఈశాన్య దిశ నుంచి కింది స్థాయి గాలులు తెలంగాణ వైపునకు వీస్తుండటంతో నగరంలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే తక్కువగా నమోదవుతుండటంతో రాత్రి, తెల్లవారుజాము సమయాల్లో వాతావరణం చల్లగా ఉంటుందని అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 32.1 డిగ్రీల సెల్సీయస్, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే ఒక డిగ్రీ తగ్గి, 18.0 డిగ్రీల సెల్సీయస్ గాను, గాలిలో తేమ 59 శాతంగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.